క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కడియం: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ అన్నారు. స్థానిక హైస్కూల్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు శుక్రవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ తిలక్ మాట్లాడుతూ మండలంలోని పలు చోట్ల గంజాయి, నాటు అమ్మకాలు, వినియోగం జరుగుతున్నట్టు తెలిసిందన్నారు. వాటికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోల్లో అనుమానితులను గుర్తిస్తే తమకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, క్రమశిక్షణతో వ్యవహరించాలన్నారు. హెచ్‌సీ రమణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీహోమం



లక్ష్మీహోమాన్ని తిలకిస్తున్న భక్తులు

కడియం: దుళ్లలోని భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం లక్ష్మీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆలయ అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు పర్యవేక్షణలో జరిగిన లక్ష్మీహోమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తెల్లవారుజామునే అభిషేకాలు, నిత్య పూజలు, అనంతరం సామూహిక కుంకుమర్చనలు నిర్వహించారు. రాత్రి గజవాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు. శనివారం సుదర్శన హోమం, పుష్పక వాహన సేవ ఉంటుందని ఆలయ భక్తబృందం తెలిపింది.

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

కడియం: మురమండలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఆ పార్టీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ శుక్రవారం ప్రారంభించారు. పార్టీ నాయకులు వెంపటి గంగారావు చౌదరి నివాసంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయంలో పార్టీ కార్యకలాపాలు, కన్వీనర్లు, గృహ సారథుల సమావేశాలకు వీలుగా ఉంటుందన్నారు.

11న జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు: ఈ నెల 11న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ప్రజల సమస్యలను గుర్తించి, ఎక్కువ కేసులు పరిష్కరించే దిశగా కృషి చేయాలని జిల్లా అదనపు న్యాయమూర్తులు సీహెచ్ రాజగోపాల్, ఎం.నాగేశ్వరరావు, డి.విజయ్‌గౌతమ్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పోలీస్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల డీఎస్పీలు, సీఐలు, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నేడు గోగ్రీన్ చాలెంజ్

రాజమహేంద్రవరం సిటీ: ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో శనివారం జగనన్న హరిత నగరాలు (యువత – హరిత) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అశోకా థియేటర్ రోడ్డు సిమెంట్రీ పేట జంక్షన్ వద్ద గోగ్రీన్ చాలెంజ్ జరగనుంది. ఈ కార్యక్రమానికి బిగ్‌బాస్ సభ్యులు హాజరవుతారు. నగరంలోని విద్యార్థులు, యువత తరలి రావాలని ఎంపీ భరత్ రామ్ కోరారు.

బంగారు గొలుసు చోరీ

ధవళేశ్వరం: రాజవోలు గాయత్రీ నగర్‌కు చెందిన శకలాబత్తుల స్వర్ణమాల చిన్న దుకాణం నిర్వహిస్తోంది. శుక్రవారం సాయంత్రం 6.20 గంటల సమయంలో ఇద్దరు యువకులు వచ్చి సిగరెట్లు అడిగారు. ఆమె సిగరెట్లు ఇస్తుండగా మెడలోని బంగారం గొలుసును లాక్కుని మోటార్ సైకిల్‌పై పారిపోయారు. దాని విలువ రూ.80 వేలు ఉంటుందని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ధవళేశ్వరం ఎస్సై వి.క్రాంతికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు

శ్యామల	వారసుడు
సూర్యమినీ	మాలికాపురం
సూర్యప్యాలెస్	పఠాన్
స్వామి	వాల్తేరు వీరయ్య
శివజ్యోతి	మైఖేల్
అనుశ్రీ	మైఖేల్
రాజా	పఠాన్
అశోక	వీరసింహారెడ్డి
కుమారి	సువర్ణసుందరి
ఊర్వశి	పఠాన్
రంభ	బుట్టబొమ్మ
మేనక	ప్రేమదేశం
గీతాఅప్సర	రైటర్ పద్మభూషణ్
నామవరం	
వీఎస్ మహల్	పఠాన్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	వాల్తేరు వీరయ్య
కడియం	
వెంకట సూర్య	మైఖేల్



విశ్వనాథ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జిత్ మోహన్ మిత్ర తదితరులు



పల్ల వెంకన్న నర్సరీలో షూటింగ్ సందర్భంగా నర్సరీ రైతులతో విశ్వనాథ్



విశ్వనాథ్‌తో అంగటి రమేష్, పార్వతి దంపతులు



ధవళేశ్వరంలో చిన్నబ్బాయి షూటింగ్ సమయంలో..

గోదారి తీరం.. కన్నీటి సంద్రం

- కళాతపస్వి విశ్వనాథ్ మృతితో విషాద ఛాయలు
- విలపించిన గోదారమ్మ

ప్రకాశం నగర్: గోదావరి అందాలతో సినిమాలకు జీవం పోసిన మహాదర్శకుడు, కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్ లేరనే వార్తను జిల్లా వాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. గోదావరితో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని కన్నీరు పెడుతున్నారు. అనారోగ్య సమస్యలతో విశ్వనాథ్ గురువారం రాత్రి కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం బ్రౌన్ మందిరంలో విశ్వనాథ్ సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన తైలవర్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గాయకుడు, నటుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్ర మాట్లాడుతూ విశ్వనాథ్ తనకు తెలుగుతో పాటు హిందీ సినిమాల్లోనూ నటించే అవకాశం కల్పించారన్నారు. సన్నిధానం శాస్త్రి, జీవీ రమణ, కవి ఎర్రపగడ ప్రసాద్, అనిశెట్టి సత్యప్రసాద్, దేశిరెడ్డి బలరామ నాయుడు, పీఎస్ కృష్ణారావు పాల్గొన్నారు.

నర్సరీలతో అనుబంధం

కడియం: నర్సరీలతో దర్శకుడు కె.విశ్వనాథ్‌కు మంచి అనుబంధం ఉందని పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు పల్ల సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, గణపతి అన్నారు. విశ్వనాథ్ మృతికి సంతాపం తెలిపారు. సూత్రధారులు, చిన్నబ్బాయి చిత్రాలను తమ నర్సరీలో చిత్రీకరించారని గుర్తు చేసుకున్నారు. దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డు అందుకున్న సందర్భంగా కళాభిమానులు రాజమహేంద్రవరంలో ఆయన్ను సత్కరించినప్పుడు కడియానికి చెందిన చెళ్లపిళ్ల కళాసేవాసమితి ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించామన్నారు.



విశ్వనాథ్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న లలితాసింధూరి

తీరని లోటు

రాజమహేంద్రవరం రూరల్: కళాతపస్వి విశ్వనాథుని మరణం మనకు తీరనిలోటు అని మోరంపూడికి చెందిన ఎల్ఐసీ ఉద్యోగి అంగటి రమేష్, పార్వతి దంపతులు అన్నారు. విశ్వనాథ్ పుట్టినరోజు సందర్భంగా గతేడాది ఫిబ్రవరి 19వ తేదీన హైదరాబాద్‌లోని ఆయన స్వగృహానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపామన్నారు. ఆయనతో గడిపిన మధుర క్షణాలు మరువలేనివన్నారు.



కె.విశ్వనాథ్ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న సప్పా దుర్గా ప్రసాద్

ధవళేశ్వరంలో చిన్నబ్బాయి సినిమా ప్రారంభం


ధవళేశ్వరం: వెంకటేష్ హీరోగా 1996లో రూపొందిన చిన్నబ్బాయి చిత్రాన్ని ధవళేశ్వరంలోని స్వామి సుందర చైతన్యనంద ఆశ్రమంలో విశ్వనాథ్ ప్రారంభించారు. అలాగే ధవళేశ్వరానికి చెందిన నర్తకి డాక్టర్ వై.లలితాసింధూరి 2009లో సిరిసిరిమువ్వ నృత్య పోటీల్లో ప్రథమ స్థానాన్ని సాధించి విశ్వనాథ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వైఎంసీఏ నిర్వహించిన జాతీయ స్థాయి నృత్య పోటీల్లో విజేతగా నిలిచి రెండోసారి విశ్వనాథ్ చేతుల మీదుగా పురస్కారం పొందారు.

అభినందించారు

సూత్రధారులు సినిమాకి నృత్య దర్శకత్వం చేసే అవకాశం కల్పించారు. ఆపద్బాంధవుడు, సిరిమువ్వల సింహనాదం సినిమాల్లో నటించాలని కోరారు. నాకు సినిమాలపై ఆసక్తి లేదని సున్నితంగా తిరస్కరించడంతో ఆయన కళకి అంకితమైన నిన్ను చూస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. సూత్రధారులు సినిమా షూటింగ్ ఇక్కడ జరుగుతున్నప్పుడు శివరాత్రి మహోత్సవం పురస్కరించుకుని ఆయనను సత్కరించడం జరిగింది. నేను, నా శిష్యబృందం చేసిన ఆలయ నృత్యం, పేరిణి శివతాండం చూసి అభినందించారు.

– సప్పా దుర్గాప్రసాద్, నాట్యాచారుడు

వైఎస్సార్ సీపీ బలోపేతానికి చర్యలు



బర్రే కొండబాబు



బళ్లా సత్యవతి



బాబూ రాజేంద్ర ప్రసాద్



గాదిరెడ్డి పెదబాబు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికాబద్ధమైన చర్యలకు శ్రీకారం చుట్టామని ఆ పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తెలిపారు. దీనిలో భాగంగా నగరంలో నాలుగు డివిజన్లకు పార్టీ ఇన్‌చార్జులను మార్పుచేశామన్నారు. 3వ డివిజన్‌కు బళ్లా సత్యవతి, 33వ డివిజన్‌కు గాదిరెడ్డి పెద్దబాబు, 38వ డివిజన్‌కు అరిగెల బాబూ రాజేంద్ర ప్రసాద్, 49వ డివిజన్‌కు బర్రే కొండబాబును ఇన్‌చార్జులుగా నియమించినట్లు తెలిపారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రక్షాళన చర్యలు చేపట్టి అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ డివిజన్ ఇన్‌చార్జి పదవులు నిర్వహించిన వారికి సముచిత స్థానం ఇవ్వనున్నట్లు తెలిపారు.

బోధ వ్యాధి నివారణపై శిక్షణ శిబిరం

కంబాలచెరువు: ఈ నెల 10వ తేదీన నిర్వహించే జాతీయ బోధ వ్యాధి నివారణ కార్యక్రమంపై మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఫైలేరియా నివారణ కార్యక్రమం)లో భాగంగా రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పారా మెడికల్ సూపర్‌వైజర్, వైద్యాధికారులతో శుక్రవారం శిక్షణ శిబిరం జరిగింది. దీనికి జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు హాజరై వైద్య అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఫైలేరియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మందుల పంపిణీ, కార్యాచరణ, సూక్ష్మ ప్రణాళికపై చర్చించారు. ఈనెల 10న డీఈసీ టాబ్లెట్ పంపిణీ సక్రమంగా జరిగేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ముందస్తుగా దగ్గరగా ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాలతో సమన్వయం చేసుకొని ఏవిధమైన అవాంతరాలు ఎదురుకాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి జి.వీర్రాజు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

కడియం: ఉద్యోగం పేరుతో డబ్బులు తీసుకుని, మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మాధవరాయుడు పాలెం పంచాయతీ పరిధి గుబ్బలవారిపాలెంకు చెందిన కె.నాగలక్ష్మి ఆశవర్కర్‌గా పనిచేసేవారు. భర్త అనారోగ్యం నేపథ్యంలో ఉద్యోగం మానేశారు. ఆ తర్వాత భర్త చనిపోవడంతో తిరిగి ఆ ఉద్యోగం ఇప్పించాలని కాకినాడ పీఆర్ కాలేజీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నక్కా రాజశేఖర్ రవిప్రసాద్‌ను 2019లో సంప్రదించారు. అయితే అప్పట్నుంచి ఉద్యోగం నాగలక్ష్మికి రాలేదు. ఆమె ఇచ్చిన రూ.3 లక్షలు, అప్పుగా ఇప్పించిన రూ.4 లక్షలు తిరిగి ఇవ్వాలని అడిగితే ఆమెపై రవిప్రసాద్ దౌర్జన్యం చేశాడు. ఈ నేపథ్యంలో నాగలక్ష్మి కడియం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

బాలుడి వైద్య సహాయానికి కృషి



మేఘనాథ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: బుర్రిలంకకు చెందిన జామన మేఘనాథ్ అనే రెండేళ్ల బాలుడు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలిసిన వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ శుక్రవారం ఆ బాలుడి ఇంటికి వెళ్లి అతడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అంతకు ముందే కలెక్టర్‌ను కలిసి బాలుడి విషయాన్ని వివరించారు. కోవిడ్‌తో బాలుడి తండ్రి మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో తీవ్రంగా చలించిన చందన సీఎం పేషీలోని అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ సాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు తిరుమలశెట్టి శ్రీను, వాసు, జగదీష్, ఊటుకూరి శైలజ, గాద రామకృష్ణ, అన్నందేవుల శ్రీను, బోడపాటి మూర్తి, మండెల బంగారయ్య, బోడపాటి సత్తిబాబు ఉన్నారు.

బాలుడి కిడ్నాప్ నిందితుడు అరెస్ట్



మాట్లాడుతున్న జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ విజయశంకర్, చిత్రంలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో బాలుడిని అపహరించిన సామర్లకోటకు చెందిన పల్ల లక్షబాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ విజయశంకర్ తెలిపారు. శుక్రవారం జీఆర్పీ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్వతీపురానికి చెందిన అంధులైన మన్నవ శివగోపీకృష్ణ, శ్రీదేవి దంపతుల మూడేళ్ల కుమారుడు హేమంత్ కుమార్ జనవరి 2వ తేదీన రాజమహేంద్రవరం స్టేషన్‌లోని ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పై ఆడుకుంటుండగా లక్షబాబు అపహరించాడు. దీనిపై బాలుడి తల్లిదండ్రులు జీఆర్పీ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మూడు ప్రత్యేక బృందాలు గాలింపులు జరిపి 72 గంటల్లో బాబును విజయవాడలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసి విజయవాడ కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండ్‌కు విధించారన్నారు. సమావేశంలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జీఆర్పీ ఎస్సైలు మావుళ్లు, లోవరాజు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పీఎస్ నారాయణ పాల్గొన్నారు.

వృద్ధులకు అండగా స్వర్ణాంధ్ర సేవాసంస్థ



చీరలు పంపిణీ చేస్తున్న తుమ్మిడి రామ్‌కుమార్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవాసంస్థ వృద్ధులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని పలువురు ప్రశంసించారు. ఆ వృద్ధాశ్రమం 19వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వర్ణాంధ్ర వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ లయన్ గుబ్బల రాంబాబు సమకూర్చిన దుస్తులను వృద్ధులకు అందజేశారు. జేసీఐ నేషనల్ ట్రైనర్ దారపు నాగిరెడ్డి మాట్లాడుతూ లయన్స్, సీపీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్, రోటరీ, జేసీఐ వంటి అంతర్జాతీయ సంస్థలతో కలిసి స్వర్ణాంధ్ర చేస్తున్న సేవలు నిరుపమానమన్నారు. డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ వృద్ధాశ్రమం ప్రారంభం నుంచి సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. తుమ్మిడి అరుణకుమార్, లయన్స్ రాజమహేంద్రవరం అధ్యక్షులు ఎంవీఎస్ మాధవరావు, వసంత కుమారి, దుర్గాదేవి పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు

కంబాలచెరువు: విజిలెన్స్ ఎస్పీ పీవీ రవికుమార్ ఆధ్వర్యంలో అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని ఎరువుల దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. అమలాపురంలోని శివశక్తి ఎంటర్‌ప్రైజెస్‌పై కేసు నమోదు చేసి రూ.71,671 విలువైన సుమారు 2.645 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని శివసాయి ఆగ్రో ఇన్‌పుట్స్ దుకాణంలో స్టాక్ రిజిస్టర్లు సరిగ్గా లేకపోవడాన్ని గుర్తించారు. రూ.3,94,382 విలువైన ఎరువులను సీజ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లిలోని ధనేశ్వరి ట్రేడర్స్‌లో రూ.2,50,639 విలువైన ఎరువులను సీజ్ చేశారు. ఖండవల్లిలోని డీసీఎంఎస్‌ను తనిఖీ స్టాక్ నిల్వలలో వ్యత్యాసాలు వున్నందున రూ.5,19,973 విలువైన 24.19 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాన్ని నిలుపుదల చేశారు.

బిల్డర్ అదృశ్యం



ప్రసాద్ (ఫైల్)

కడియం: ఇంటి నుంచి వెళ్లిన తన భర్త ఇప్పటివరకు తిరిగి రాలేదని కడియం మేకలదిబ్బ ప్రాంతానికి చెందిన బిడిగంటి నాగలక్ష్మి శుక్రవారం కడియం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మేకలదిబ్బకు చెందిన 40 ఏళ్ల బిడిగంటి ప్రసాద్ ఇళ్లు నిర్మిస్తూ బిల్డర్‌గా పనిచేస్తున్నాడు. భవనాల నిర్మాణం కోసం కొంత అప్పు చేశాడు. రుణదాతల ఒత్తిడి తట్టుకోలేక ఈ నెల ఒకటో తేదీన రాత్రి 11 గంటల సమయంలో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. ఈ మేరకు కడియం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాల తనిఖీ

కంబాలచెరువు: రాజమహేంద్రవరంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల, బోధనాసుపత్రిని నేషనల్ మెడికల్ కౌన్సిల్ సూపర్‌వైజర్ల బృందం సభ్యులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. న్యూఢిల్లీ నుంచి వచ్చిన వీరు ఆసుపత్రిలో రోగులకు ఏ విధమైన వైద్య సేవలను అందుతున్నాయో తెలుసుకున్నారు. వార్డుల్లో పర్యటించి వైద్యసేవలను పరిశీలించారు. వైద్య పరీక్షల విభాగం, ఎమ్ఆర్ఐ విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల పనులను పరిశీలించారు. ఎన్ఎమ్‌సీ బృందం ఆసుపత్రిలో పర్యటిస్తున్న సమయంలో జిల్లా కలెక్టర్ మాధవీలత అక్కడికి వచ్చారు. కళాశాల నిర్మాణ పనులు, చేపట్టాల్సిన చర్యలపై మాట్లాడుకున్నారు. అనంతరం పలు ప్రాంతాలనుంచి వచ్చిన వైద్య కళాశాల ప్రొఫెసర్లతో సమావేశమయ్యారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



స్పోర్ట్ మీట్‌లో చందన నాగేశ్వర్, మార్గాని నాగేశ్వరరావు



ఏషియన్ గేమ్స్ విజేతను సత్కరిస్తున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- ఉత్సాహంగా స్పోర్ట్స్‌మీట్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. శంభూనగర్‌లోని శ్రీహర్షవర్ధన గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ దొశెట్టి కేశవ హరిప్రసాద్ ఆధ్వర్యంలో 13వ ఇంటర్ స్కూల్స్ స్పోర్ట్స్‌మీట్ 2022–23 శుక్రవారం ఉత్సాహంగా సాగింది. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న చందన నాగేశ్వర్ ఒలింపిక్ పతాకాన్ని ఎగురవేయగా, ఉభయ రాష్ట్రాల బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు క్రీడాజ్యోతిని వెలిగించారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. ఏషియన్ గేమ్స్‌లో రాణించిన దేవరపల్లి బ్రాంచి విద్యార్థినిని షర్మిలారెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దొశెట్టి సుగుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఏపీ జేఏసీ కార్యవర్గం



ఏపీ జేఏసీ అమరావతి జిల్లా నూతన కార్యవర్గం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఏపీ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం స్థానిక రెవెన్యూ అసోసియేషన్ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 31 సభ్య సంఘాల ప్రతినిధులు హాజరై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ చైర్మన్‌గా మెల్లిమి క్రాంతి ప్రసాదరావు (డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ), జనరల్ సెక్రటరీగా ఏఆర్. శివకుమార్ (సీనియర్ అసిస్టెంట్, కోపరేటివ్ డిపార్ట్‌మెంట్), కోశాధికారిగా ఎస్.స్వామినాథన్ (లాంగ్వేజ్ పండిట్, కోరుకొండ హైస్కూలు), అసోసియేట్ చైర్మన్‌గా ఎం.గాలిబ్ అహ్మద్ (పంచాయతీరాజ్ ఏఈఈ), వైస్ చైర్మన్లుగా కె.త్రిమూర్తులు (ఏపీఎస్ఆర్టీసీ కండక్టర్), డాక్టర్ యు.ముఖేష్(వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్), టీఎస్ కార్తిక్ (అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్), కె.సుందరమ్మ(ఏఎస్‌డబ్ల్యూవో, రాజమహేంద్రవరం), సెక్రటరీలుగా డాక్టర్ కాటికేల సుధాకర్ (ప్రభుత్వ వైద్యులు), వి.శేషగిరిరావు (సూపరింటెండెంట్, సర్వే డిపార్ట్‌మెంట్), కోలా సత్యనారాయణ(ప్రధానోపాధ్యాయుడు), టీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు(ఎల్‌వీ డ్రైవర్, ఆర్అండ్‌బీ డిపార్ట్‌మెంట్) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి, ఎన్నికల పరిశీలకులుగా ఏపీజేఏసీ అమరావతి కాకినాడ జిల్లా చైర్మన్, జనరల్ సెక్రటరీలు పితాని త్రినాథరావు, ఎన్‌వీఎస్ఎస్ఆర్‌కే దుర్గాప్రసాద్ వ్యవహరించారు.

విద్యార్థిని అదృశ్యం

కంబాలచెరువు: కళాశాలకు వచ్చిన విద్యార్థిని అదృశ్యమైన సంఘటనపై ఒకట పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. రాజానగరం మండలం కాటవరానికి చెందిన విద్యార్థిని రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. ఆమె కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

14 నుంచి కబడ్డీ పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకూ నాలుగు రోజుల పాటు రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కాలేజీలో అంతర జిల్లాల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కందుకూరి మనోజ్ బాబు ప్రకటించారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కబడ్డీ పోటీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ పోటీలో సుమారు వందటీములు పాల్గొంటున్నాయన్నారు. జిల్లా అధ్యక్షులు బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, కబడ్డీ పోటీ జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

మున్సిపల్ పార్కుకు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. గాంధీపురంలో రూ.9.8 లక్షలతో చేపట్టే మున్సిపల్ పార్కు నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామ సచివాలయం కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అంగనవాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో 12వ డివిజన్ ఇన్‌చార్జి పెద్దిరాజు, మానే దొరబాబు, మేరపురెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల సమర్పణ



భక్తులు సమర్పించిన ఆభరణాలు

ధవళేశ్వరం: ధవళగిరిపై కొలువైన శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీజనార్దనస్వామికి శుక్రవారం భక్తులు సుమారు రూ.1.30 లక్షల విలువైన బంగారు ఆభరణాలను సమర్పించారు. స్వామికి లక్ష్మీదేవి బంగారు డాలరు, శ్రీదేవి, భూదేవి, గోదాదేవి అమ్మవార్లకు శంకు చక్రాలతో కూడిన నల్లపూసల గొలుసులు, 111 వెండి పువ్వులను శుక్రవారం సాయంత్రం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు సమక్షంలో అందజేశారు.